## ఇచ్చిన హామీ అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేశారని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న బాయ్స్ మెయిన్ స్కూల్లో 'తల్లికి వందనం' కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం, స్కూళ్ల ప్రారంభం కాకముందే తల్లికి వందనం అమలుచేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ ఉన్న పిల్లల సంఖ్యను బట్టి వారికి లబ్ధి అందడం ఆనందదాయకమని చెప్పారు. తల్లులు ఈ పథకం పట్ల సంతృప్తి వ్యక్తం చేయగా, మాధవి విద్యార్థులకు మరిన్ని వసతులు కల్పించేందుకు ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సూర్యనారాయణ, హెచ్ఎం, స్కూల్ టీచర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘాటు తగ్గిన పచ్చిమిర్చి

- అమాంతంగా పడిపోయిన ధరలు
- మార్కెట్లో 50 కిలోల బస్తా రూ.500
- కూలీల ఖర్చులు కూడా రాలేదని రైతుల ఆవేదన
- ఆశాజనకంగా దిగుబడులు
- ధరల్లేకనే మిరప రైతులు విలవిల

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈ ఏడాది పచ్చి మిరప ధరలు అమాంతంగా పడిపోయాయి. తోటలలో దిగుబడులు చేతికి వచ్చినప్పటి నుంచి మార్కెట్లో ధరలు పుంజుకోలేదు. గత ఏడాది మిరప ధరలు బాగా ఉండటంతో ఈ ఏడాది రైతులు వేసవి మిరప సాగును విస్తారంగా చేపట్టారు. నియోజకవర్గంలో పులివెందుల మండలంలో నల్లగొండవారిపల్లి, ఇ.కొత్తపల్లి, లింగాల మండలంలో అంబకపల్లి, లింగాల, వేముల మండలంలో నారేపల్లి, కొండ్రెడ్డిపల్లి, మబ్బుచింతలపల్లి ప్రాంతాలలో అధికంగా పచ్చిమిరప సాగు చేశారు. మంచి మొక్కలను బయట ప్రాంతాల్లోని నర్సరీలలో తీసుకొచ్చి సాగు చేశారు. ఒక్కొక్క మొక్క 50 పైసల నుంచి ఒక్క రూపాయితో కొనుగోలు చేశారు. రైతులు మిరప సాగుకు మొగ్గు చూపడంతో నర్సరీల నిర్వాహకులు మొక్కల ధరలు పెంచి సొమ్ము చేసుకున్నారు. సాగులో పెట్టుబడులు అధికంగా ఉన్నా ఆదాయం బాగుంటుందనే ఉద్దేశంతో రైతులు సాగుకు మొగ్గు చూపారు. మార్కెట్లో పడిపోయిన మిరప ధరలు దిగుబడులు వచ్చే ఆరంభంలో మార్కెట్ ధరలు బాగా ఉంటాయి. ఈ ఏడాది అందుకు భిన్నంగా ధరలు ఉండటంతో రైతులు నష్టపోతున్నారు. గత ఏడాది పచ్చిమిరప ధరలు ఆరంభంలో 50 కిలోల బస్తా రూ.3 వేలకుపైనే ధరలు పలికాయి. ఈ ఏడాది బస్తా రూ. 500 నుంచి 600 వరకు పలుకుతున్నాయి. దీంతో మిరప సాగులో ఆశించిన మేర ఆదాయం ఉండదనే సాగులో పెట్టిన పెట్టుబ డులు కూడా గిట్టుబాటు అవుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప సాగు రైతులను నష్టాల బాటలోకి నెట్టింది. ఈ ఏడాది ధరలు పుంజుకోకపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగులుతోంది. మార్కెట్ ధరలను చూస్తే కూలీ ఖర్చులు కూడా వస్తాయో లేదోననే భయంతో కోతలు కూడా కోయలేకపోతున్నామని రైతులు వాపోయారు. కూలీ రేట్లు పెరగడంతో రైతుకు గిట్టుబాటు కావడంలేదు. వ్యవసాయ పనులు ఉండటంతో మిరప కోతలకు కూలీల డిమాండ్ పెరిగింది.

మిరపకాయలను అమ్మకానికి సిద్ధం చేస్తున్న రైతు

ఇటు మార్కెట్లో ధరలు లేకపోవడం, కూలీ రేట్లు పెరగడంతో రైతులకు మిరప సాగు నష్టాలను తెచ్చి పెడుతోంది. రోజుకు ఒక్కొక్క కూలీకి మధ్యాహ్నం వరకు రూ.300 ం ఇస్తున్నామని. బస్తా మిరప కాయలు కూడా కోయలేకపోవడంతో గిట్టు బాటు కావడంలేదని రైతులు అంటున్నారు.

### శాజనకంగా దిగుబడులు

మిరప దిగుబడులు బాగా రావడంతో మార్కెట్‌కు తరలించేందుకు మిరప కాయల బస్తాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది వేసవి మిరప పంటను రైతులు మార్చి నెలలో సాగు చేసుకున్నారు. సాగు చేసినప్పటి నుంచి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పంటకు తెగుళ్ల సోకకుండా సకాలంలో మందులు పిచికారి చేశారు. సకాలంలో నీటి తడులు ఇవ్వడంతో పంట ఏపుగా పెరిగి ఆశించిన మేర దిగుబడులు వచ్చాయి. ఎకరాకు రూ.250 నుంచి రూ.300 బస్తాల వరకు మిరప దిగుబడుల వస్తున్నాయని రైతులు అంటున్నారు. సాగులో దిగుబడులు ఆశించిన మేర మార్కెట్ ధరలు ఉంటే ఎకరాకు రూ.2లక్షల వరకు ఆదాయం ఉండేదని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

### నాలుగు ఎకరాలలో మిరప సాగు చేశా

నాకున్న 4 ఎకరాలలో వేసవి పంటగా పచ్చి మిరప సాగు చేశా. సాగుకు రూ.4 లక్షల మేర పెట్టుబడి పెట్టా. తోటలలో దిగుబడులు వస్తున్నాయి. మార్కెట్ ధరలు లేక కూలీలకే సరిపోతోంది. చివరి కోతల్లోనైనా మార్కెట్ ధరలు పెరుగుతాయనే ఆశతో ఉన్నాం. ధరలు పెరగక ఇలాగే ఉంటే సాగులో తీవ్రంగా నష్టపోతాం.

**- రామచంద్రారెడ్డి, మిరప రైతు, కొండ్రెడ్డిపల్లి, వేముల మండలం.**

### ధరల్లేక సాగులో నష్టపోయా

ఈ ఏడాది ధరలు ఉంటాయనే ఆశతో 2 ఎకరాలలో మిరప పంటను సాగు చేశా. సాగుకు రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టా పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకున్నా. దిగుబడి చేతికొచ్చేసరికి మార్కెట్లో మిరప కాయలు ధరలు పడిపోయాయి. దిగుబడులు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ధరలు లేవు. సాగులో పెట్టుబడులు రాక, కూలీ ఖర్చులు కూడా గిట్టుబాటుకాక నష్టపోయా.

**- రాజ కుళాయిరెడ్డి, మిరప రైతు, లింగాల మండలం.**

### గిట్టుబాటు ధర కల్పించాలి

ధరను వ్యాపారులే నిర్ణయించడంతో రైతుకు గిట్టుబాటు కావడం లేదు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగొస్తుందో, లేదో అన్నట్లుంది పరిస్థితి. అందుకే మోపెడ్‌పై నిత్యం 50 కిలోల వరకు గోతాల్లో కట్టుకుని అమ్ముకుంటున్నా. వారాంతపు సంతల్లో కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నా. ఖర్చులు పోనూ 10 కిలోలకు నాకు రూ.150 మిగులుతాయి. ప్రభుత్వం మిర్చికి మద్దతు ధర నిర్ణయిస్తే బాగుంటుంది.

**-గంగిరెడ్డి, మిరప రైతు, పులివెందుల.**

తాగునీటి మోటర్‌ను పరిశీలిస్తున్న ఇఒ మాధవరెడ్డి

## శ్రీరాంనగర్‌లో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీరాంనగర్‌లోనాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో శ్రీరాం నగర్‌లో ఉన్న వాటర్ ట్యాంకుకు నీరు సరఫరా కాకపోవడంతో నాలుగు రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. డైరెక్టుగా తాగునీటిని సరఫరా చేసేందుకు వీలు ఉన్నప్పటికీ మోటర్‌కు స్టాటర్, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అ ప్రాంత ప్రజలు బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి ఇఒ మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇఒ అ ప్రాంతాన్ని పరిశీలించి రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. పారిశుధ్యంపై కూడా ప్రత్యక చర్యలు తీసుకొంటున్నట్లు ఇఒ చెప్పారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలని ఇఒ ప్రజలను కోరారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పాత పేట, కాపు వీధి, గాండ్ల వీధి, మెయిన్ బజార్, సంత మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉండడంతో ఇటీవల పాపాఘ్ని నదిలో రెండు ఫిల్టర్లులను వేసి స్టాటర్లు అమర్చారు. తాగునీటి ఫిల్టర్లు నుంచి పైపు లైన్‌కు కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. అ ప్రాంతాల్లోనూ రోజు రోజుకు తాగునీటి సమస్య తలెత్తుతోంది. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ కనెక్షన్ ఇచ్చి ప్రజలకు తాగునీటి కష్టాలు తొలగించాలని కోరారు.

## స్వయం సహాయక సభ్యులు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - వల్లూరు : స్వయం సహాయక సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం వల్లూరు మండలం ఎ ఓబాయపల్లిలో స్వయం సహాయక సభ్యురాలు దాసరి కేశమ్మ సెర్ప్ ఉన్నతి పిఎం అభయ్ పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన కిరాణా దుకాణం పరిశీలించారు. అనంతరం ఆమెకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. మహిళలు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం యామిని, పూర్ణిమ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న పీడీ రాజ్యలక్ష్మి

తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి - కడప అర్బన్

నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పాలని కడప శివారులోని రాజీవ్ గృహకల్పలోని (21వ వార్డు) నగరపాలక మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సులోచన రాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, జె.ఆనంద కుమార్, టి.సత్యనారాయణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సల్మాన్ ఖాన్, సిబ్బంది విజయ కలిసి ఇంటింటికి వెళ్లి విద్య ఆవశ్యకతను వివరించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కూలీల విశ్రాంతి సమయమైనా సాయంత్రం వేళల్లో వెళ్లి బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను పాఠశాలలకు పంపాలని కోరారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగు, యూనిఫామ్, బెల్ట్, షూ, సాక్సులు, మధ్యాహ్నం పౌష్టికాహారం ప్రభుత్వం పిల్లలకు అందిస్తోందని అవగాహన కల్పించారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి తల్లిఖాతాల్లో తల్లికి వందనం' పేరుతో ప్రభుత్వం రూ. 13 వేలు జమ చేస్తోందని తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఇక్కడ ఉన్నారని పేర్కొన్నారు. చక్కటి విద్యా బోధన తో పాటు విలువలు కలిగిన విద్యను అందిస్తామని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### - కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

యోగాతోనే సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్య భాగ్యం సిద్ధిస్తుందని, దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. బుధవారం పర్యాటక యోగా థీమ్‌తో గండికోట చారిత్రక పర్యాటక క్షేత్రంలో జిల్లా పర్యాటక, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో 5 వేల మంది పౌరులతో యోగా గురువులు, యోగాసనాలు వేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతలకు యోగా మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. చదువులు, ఇళ్లలో పనులు, ఆఫీసుల్లో ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. అత్యంత చారిత్రక వైభవం ఉన్న గండికోట ప్రాంతం పెన్నా నది తీరంలో సుభిక్షమైన వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు, పారిశ్రామిక వాడలకు ప్రత్యేక ఆకర్షణగా వెలుగొందుతోందన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే యోగాసనాలు వేసి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. పలువురు ప్రముఖులు, వివిధ శాఖల జిల్లా అధికారులు కూడా కలెక్టర్‌తో పాటు యోగాసనాలు వేశారు. చివరగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డ్రగ్స్ నిర్మూలనపై ఈగల్ టీమ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధితాధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వర్లు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, ఎన్‌ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఇసి మెంబర్ డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, రాయలసీమ కాలేజ్ ఆఫ్ పిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భూమిరెడ్డి రామసుబ్బారెడ్డి, గండికోట గ్రామ సర్పంచ్ ఈశ్వర్, జిల్లా అధికారులు, ఆయుష్ సిబ్బంది, పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, పెద్ద ఎత్తున మహిళలు, యువత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పాఠశాల ఎదుట నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

## పాఠశాల విలీనం వద్దు

### - నిరసనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - చాపాడు

ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడం ఆపాలని, దళితవాడలో 5వ తరగతి వరకు కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం నిరసన తెలియజేశారు. ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభించినప్పటికీ విద్యార్థులను పాఠశాలలకు పంపడం లేదు. రోజూ వారు పాఠశాల ఆందోళన చేస్తున్నారు. బుధవారం పాఠశాల ఎదురుగా విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలియజేస్తూ తమ పిల్లలను ఇతర పాఠశాలలకు పంపే ప్రసక్తే లేదని తెల్చి చెప్పారు. దళితవాడలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందని అలాంటి పాఠశాలను మూసే ప్రయత్నం చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని పాఠశాలను కొనసాగించాలని కోరారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంఆర్‌పిఎస్ నాయకులు కర్ణా మాదిగ తెలిపారు. అనంతరం తహశీల్దార్, ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు.

## మాజీ సిఎంలను కఠినంగా శిక్షించండి

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై.ఎస్. షర్మిల, ఆమె భర్త బ్రదర్ అనిల్ కుమార్, వారి సిబ్బంది ఫోన్లను ఏకకాలంలో టాపింగ్ చేసిన వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖర రావు, వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిపై తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా కేసులు నమోదు చేసి సత్వర విచారణ చేపట్టాలని ఎపి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. బుధశారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల వ్యక్తిగత గోప్యత, వ్యక్తిగత స్వేచ్ఛలను లక్ష్యంగా చేసుకొని ఆమెపై రాజకీయ కుట్ర, అనధికారిక సమాచార సేకరణ ఇతర సెక్షన్ల కింద వెంటనే రెండు ప్రభుత్వాలు కేసులు నమోదు చేసి మాజీ సిఎంలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో, ఎపిలలో షర్మిలను రాజకీయంగా టార్గెట్ చేయడం మే కాకుండా ఆమెను వ్యక్తిగత స్థాయిలో కూడా తీవ్ర ఇబ్బందులకు గురి చేసే విధంగా ఇద్దరు మాజీ సీఎంలు అప్పటి ప్రభుత్వాలు రాజ్యాంగపరంగా ఘోరమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో కుట్ర కోణాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, టిఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, ఎన్‌డిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రాంతీయ సంయుక్త ఉన్నత విద్యాశాఖ అధికారి శ్యాముల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పుస్తకాలు, యూనిఫామ్, అడ్మిషన్ల ఫీజు అంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అడ్మిషన్, డొనేషన్ పేరుతో రూ.3500 నుంచి పదివేల రూపాయలు రాబడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సిలబస్ చెప్పాలని ప్రభుత్వ పాఠ్యాంశాలను బోధించాలని చెబుతున్న లెక్కచేయకుండా కరికులం పేరుతో విపరీతమైన ఫీజుల దోపిడికి గురి చేస్తున్నారని చెప్పారు.కార్యక్రమంలో నాయకులు బయన్న, ప్రవీణ్, కన్నా,ఎన్డీఎస్ఎఫ్ నాయకుడు నాయుడు, చంద్ర పాల్గొన్నారు.

# విస్తరణ పనుల్లో అవకతవకలపై రచ్చ

ఎన్‌హెచ్ అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అవకతవకలు జరుగు తున్నాయని ప్రజలు ఎన్‌హెచ్ అధికారులను ప్రశ్నించారు. నాలుగు రోడ్ల నుంచి పాత బస్టాండ్ వరకు ఉన్న ప్రభుత్వ స్థలంలోని అక్రమ కట్టడాల తొల గింపులో, మురుగు కాలువ నిర్మాణంలో పక్షపాతంగా వ్యవహ రిస్తున్నారని అధికారులను నిలదీశారు. పలుకుబడి ఉన్న వారి ఇళ్ల వద్ద పక్షపాత ధోరణి చూపిస్తూ సామాన్య ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. నాలుగు రోడ్ల నుంచి పాత బస్టాండ్ వరకు మురుగు కాలువను వంకర టింకరగా నిర్మించారన్నారు. ఉన్నోడు.. పేదోడు తేడా లేకుండా కట్టడాలను తొలగించి మురుగు కాలువను సమానంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఇళ్లను తొలగించకుండా సర్దుకొని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. లేని పక్షంలో పనులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి అధికారుల పక్షపాత నిర్లక్ష్య ధోరణిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

### అక్రమ కట్టడాలను తొలగించడంలో ఉపేక్షించేదిలేదు

ప్రభుత్వ స్థలంలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించడంలో ఉపేక్షించేది లేదు. మురుగు కాలువను ప్రభుత్వ కొలతల ప్రకారం ఏర్పాటు చేస్తాం. పనులు ఎట్టి పరిస్థితుల్లో నిలిపేది లేదు. అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగిస్తాం. పనులకు ఆటంకం కలిగిస్తే రెవెన్యూ, పోలీసుల సహకారంతో ముందుకు తీసుకుపోతాం.ఆక్రమణలు తొలగించేందుకు ప్రజలు సహకరించాలి.

**- విశ్వనాథ్, ఎన్‌హెచ్ ఎఇ**

మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

### కడప కార్పొరేషన్‌లో

## టిడిపి జెండా ఎగురవేయాలి

### - ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కడపలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి కార్పొరేషన్‌లో టిడిపి జెండా ఎగురవేసేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులన్నీ కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో తెలుగుదేశం పార్టీ కడప నగర సంస్థాగత ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో పార్టీ సంస్థాగత నిర్మాణం లేకపోయినప్పటికీ ఎనిమిది నెలలు కష్టపడి బలంగా, కసిగా పనిచేసి ఎమ్మెల్యేగా మాధవిని గెలిపించుకున్నామని చెప్పారు. అదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పనిచేసి కడప కార్పొరేషన్‌లో తెలుగుదేశం పార్టీకి జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు విడతల వారీగా పదవులు ఇస్తామని, ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉంటామని పేర్కొన్నారు. బూత్, డివిజన్ నగర, నగర అనుబంధ కమిటీల సభ్యులు నిత్యం ప్రజలలోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కొంతమంది కార్యకర్తలు పైరవీలు చేసి అవినీతికి పాల్పడుతున్నారని, అలా చేసి స్థాయిని దిగజార్చు కోవద్దని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుస్తామని పేర్కొన్నారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆ దిశగా తటస్తులను, ప్రతిపక్ష పార్టీలో ఉన్న తటస్తులను గుర్తించి పార్టీలోకి ఆహ్వానించాలన్నారు. పార్టీకి ద్రోహం చేసేవారిని క్షమించే సమస్య లేదన్నారు. అలాంటి వారిని శత్రువులుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. వచ్చే నెలలో నగరంలోని 50 డివిజన్లకు సంబంధించిన అభ్యర్థులను అనధికారికంగా ఖరారు చేస్తామన్నారు. సమావేశానికి అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, జిలాని బాష పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం శూన్యం : వైసిపి

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం అంజాద్‌బాషా నివాసంలోని కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం అన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వం పాలనలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అంటే మోసానికి, ద్రోహానికి, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. ఏడాది పాలనలో అప్పు తప్ప పాలన, అభివృద్ధి లేదు అని విమర్శించారు. తల్లికి వందనం పథకంలో భారీగా కోతలు విధించారని చెప్పారు. సామాజిక పింఛను, తల్లికి వందనం పథకంలో లక్షలాది మంది లబ్ధిదారులకు మోసం చేశారని అని ఘాటుగా విమర్శించారు. ఏడాది కూటమి పాలన పూర్తిగా విఫలం చెందిందని అన్నారు.మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను విస్మరించడం మోసం కాదా అని ప్రశ్నించారు. మహిళలు, రైతులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మోసం చేశారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు తప్పకుండా టిడిపి నాయకుల చొక్కా పట్టుకునే పరిస్థితి తప్పక వస్తుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైసిపి నాయకులు యాదయ్య, షఫీ, పాకా సురేష్, పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## ఐసిఎల్ ప్లాంట్‌లో పనులు పునఃప్రారంభం : కలెక్టర్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నియోజక వర్గం, ఎర్రగుంట్లలోని ఇండియన్ సిమెంట్స్ లిమిటెడ్ (ఐసిఎల్) ప్లాంట్‌లో కార్మికులు, సంస్థ నిర్వహణ మధ్య ఇటీవల ఏర్పడిన విభేదాల పరిష్కారానికి చర్చించి సమస్యను పరిష్కరించామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. కలెక్టర్ ఇరు గ్రూపుతో చర్చలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉభయపక్షాలు కలిసికట్టుగా పాల్గొని, పరస్పర అంగీకారంతో అన్ని సమస్యలను సఖ్యత పూర్వకంగా పరిష్కరించు కున్నాయన్నారు. ఫలితంగా ప్లాంట్‌లో నిలిచిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయన్నారు. సంస్థ కార్యకలాపాలు ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఇరు గ్రూపులకు చెందిన వారు, జమ్మలమడుగు ఆర్‌డిఒ ఆదిములం సాయిశ్రీ పాల్గొన్నారు.

రెండు గ్రూపులతో చర్చిస్తున్న కలెక్టర్

# త్వరలో వినియోగంలోకి వాటర్ గ్రిడ్

## మొదటి ప్రాధాన్యతగా 60 గ్రామాలకు నీటి విడుదలకు సన్నాహాలు - శరవేగంగా జరుగుతున్న పనులు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

పులివెందుల నియోజవర్గంలో ప్రతి ఇంటికి శుద్ధి నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ పథకం త్వరలోనే వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నియోజవర్గంలో సింహాద్రిపురం, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాల పరిధిలోని 299 గ్రామాలకు సంబంధించి 2.5 లక్షల మందికి శుద్ధినీటిని అందించేందుకు 2022లో ప్రణాళిక రూపొందించి పనులను ప్రారంభించారు. ఇందుకు సంబంధించి రూ.480 కోట్ల వ్యయంతో పనులను చేపట్టారు. అయితే వైసిపి రెండోసారి అధికారంలోకి రాకపోవడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. మళ్లీ ఈ పనులు వేగవంతం చేయడానికి కూటమి నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించారు.

మొదటి ప్రాధాన్యతగా 60 గ్రామాలకు నీరు..

వాటర్ గ్రిడ్ పథకం నుంచి మొదటి ప్రాధాన్యతగా 60 గ్రామాలకు నీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల (జూన్) చివరి నాటికి ఈ గ్రామాలకు సంబంధించి పనులను శరవేగంగా పూర్తి చేసి నీటిని విడుదల చేయనున్నారు. ఈ వాటర్ గ్రిడ్ పథకం కింద ప్రతి ఇంటికి శుద్ధి నీటిని అందించనున్నారు. ఈ నీటిని మొదటగా పులివెందుల టౌన్, లింగాల, సింహాద్రిపురం మండలాల పరిధిలోని గ్రామాలకు నీటిని విడుదల చేయనున్నారు.

**ఏడాదికి 0.836 టిఎంసి నీరు సరఫరా..**

పులివెందుల నియోజవర్గంలోని 299 గ్రామాలకు సంబంధించి ఏడాదికి 0.836 టిఎంసి నీరు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు సంబంధించి 279 కిలోమీటర్ల డిఐ పైప్‌లైన్, 880 కిలోమీటర్లు హెచ్‌డిపి పైపులైన్, 199 ఒహెచ్‌ఎస్‌ఆర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఈ పనులకు సంబంధించి మొదటి ప్రాధాన్యత పరిధిలోని గ్రామాలకు సంబంధించి దాదాపు 95 శాతం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మొదటి ప్రాధాన్యత గల గ్రామాలకు నీటి సరఫరా పనులపై పరిశీలన చేస్తున్నారు.

పంపు హౌస్ వద్ద ఏర్పాటు చేసిన శుద్ధినీటి కేంద్రం

**శుద్ధి నీటి కోసం ఎదురు చూస్తున్నాం..**

రెండేళ్ల నుంచి శుద్ధి నీటి కోసం ఎదురు చూస్తున్నాం. ప్రస్తుతం సిపిడబ్ల్యూ స్కీం నుంచి నీరు రంగు మారి వస్తున్నాయి. ఈ కారణంగా తాగడానికి వీలు కాలేదు. వాటర్ గ్రిడ్ పథకం నీళ్ల త్వరగా విడుదల చేయాలని కోరుతున్నాను.

**- బాలకృష్ణారెడ్డి, సింహాద్రిపురం**

**ఈనెల చివరికి వినియోగంలోకి వాటర్ గ్రిడ్..**

ఈనెల (జూన్) చివరి నాటికి వాటర్ గ్రిడ్ పథకాన్ని వినియోగంలోకి తేవడానికి చర్యలు చేపట్టాం. మొదటగా 60 గ్రామాలకు నీటి సరఫరాకు సంబంధించి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాలకు నీటి సరఫరాకు సంబంధించి ట్రయల్ రన్ పూర్తి చేశాం.

**- విజయ్‌భాస్కర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ, పులివెందుల**

# అధికారుల గైర్హాజరుపై ఎంపిడిఒ అసంతృప్తి

మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణయ్య

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ఎర్రగుంట్ల ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఎంపిడిఒ వెంకటరమణయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉప మండల అధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపిడిఒ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మూడు నెలలకు ఓమారు జరిగే సమావేశానికి అధికారులు హాజరుకాకుంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాయన్నారు. సంబంధిత అధికారులు పాఠ శాలలు, గ్రామాలలోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జడ్పిటిసి బాలయ్య మాట్లాడుతూ రీ సర్వే ఆలస్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తల్లికివందనం పథకం అందేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. చాలామందికి రాలేదని వివరించారు. ఎండియు వాహనాలు రద్దు చేయడం వల్ల రేషన్ తీసు కునేందుకు ప్రజలు పనులు పోగొట్టుకోవాల్సి వస్తోం దన్నారు. తగినన్ని రేషన్ షాపులు లేవన్నారు. విద్యుత్ సమస్యలు, గ్రామాలకు రోడ్ల సమస్యలు సభలో ప్రస్తావించారు. విద్యుత్ ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి మాట్లా డుతూ విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ (అడిషనల్ లోడ్) నిమిత్తం 50 శాతం రాయితీ జూన్ 30 వరకు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్లకు సోలార్ సిస్టం బిగించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ ఇస్తు న్నాయన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి రంతులయ్య, డిప్యూటీ తహశీ ల్దారు, ఎంఇఒ శివప్రసాద్, పిఆర్ ఎఇ వినయ్‌కుమార్, స్త్రీశిశు సంక్షేమ అధి కారి హైమావతి, ఎపిఒ గంగాభవాని, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# రేపటి నుంచి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

శుక్రవారం నుంచి ఎస్‌ఎస్‌సిసిజిఎల్ పోటీ పరీక్షలకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. ఈ సందర్భంగా జెవివి కార్యాలయంలో బుధవారం గోడపత్రాన్ని ఆవిష్కరించారు. సివిల్ సర్వీసెస్ ఫ్యాకల్టీ రవిశంకర్ మాట్లాడుతూ ఎస్‌ఎస్సిసిజిఎల్ 14,582 పోస్టులు ఉన్నాయన్నారు. వీటితోపాటు ఏపీ హైకోర్టు 1621 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ బరోడా 500 పోస్టులు, ఆర్‌ఆర్బి గ్రూప్ డి 32,438 పోస్టులు, ఏఎల్‌పి 11,558 పోస్టుల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు రాదలచిన వారు 97053 33305 ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు రవిబాబు, నరేష్, దేవానంద్, మౌనిక, గాయత్రి, హైమావతి, భువన్, హరి కేశవ్, నరసింహులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

## జీవాల పెంపకం ద్వారా ఆర్థిక, ఉపాధి భరోసా

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

స్థానిక పశువైద్య కళాశాలలో పశుపోషణ విభాగం జాతీయ మాంస పరిశోధనా సంస్థ హైదరాబాదు సౌజన్యంతో జీవాల పోషణ, మెలకువలు, ఖనిజ లవణాల ప్రాముఖ్యత అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ జీవాలు, పొట్టేలు పిల్లల పెంపకం ద్వారా రైతులు సంవత్సరం పొడవునా స్థిరమైన ఆర్థిక, ఉపాధి పొందవచ్చని తెలిపారు. ఇందులో కొన్ని శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం వలన పెట్టుబడి వ్యయం తగ్గించుకోవచ్చని సూచించారు. పశుపోషణ విభాగం అధిపతి డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ రాజకిషోర్, డాక్టర్ ఇందిర, డాక్టర్ త్రివేణి, డాక్టర్ జ్ఞానచరిత, డాక్టర్ భార్గవి, డాక్టర్ విజయకుమార్ జీవాల పెంపకంలోని మెలకువలు వసతి, పోషణ, ఆదాయ వ్యయాలు, పథకాలు, వ్యాధులు, చికిత్స తదితర అంశాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు భీమగుండం, టంగుటూరు, కొర్రపాడు, పోట్లదుర్తి, కమలాపురం,పెద్దముడియం ప్రాంతాల నుంచి 30 మంది రైతులు పాల్గొన్నారు.

## జీవామృతం మొక్కకు ప్రాణం

**పులివెందుల టౌన్ :** జీవామృతం మొక్కకు ప్రాణం అని వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి అన్నారు. మండలంలోని ఈ కొత్తపల్లి గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చంటిమిరెడ్డి రవీంద్రారెడ్డి పొలంలో నిర్వహించారు. భూమి సారవంతం పెరిగేదాని కోసం ప్రకృతి వ్యవసాయ విధానాలలో(పీఎండిఎస్) నవధాన్యాల పద్ధతి ద్వారా అన్ని రకాల విత్తనాలను ఖాళీగా ఉన్న భూముల్లో విత్తిన విధానాన్ని పరిశీలించారు. ఈ విధానం ద్వారా అన్ని రకాల విత్తనాల మొక్కల వేర్ల నుండి భూమికి కావలసిన పోషకాలు అన్నీ కూడా అందిస్తాయని అన్నారు. మొక్కలు పూత దశకు వచ్చిన తర్వాత భూమిలోకి కలయదున్నడం ద్వారా రైతుకు ఎరువుల అవసరం తగ్గి పెట్టుబడిని తగ్గించుకుని భూమి సారవంతం పెంచుకోవచ్చని సూచించారు. మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అరటి పొలానికి మొక్కకు కావాల్సిన పోషకాల కోసం జీవామృతం తయారీ అక్కడే డెమోగా చేసి రైతులకు చపించారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ యామిని లత, డిజిటల్ సుభహాన్, బిఆర్‌ఎస్‌కె అసిస్టెంట్స్, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్, రైతులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**వేముల :** మండలంలోని నల్లచెరువుపల్లె, కొండ్రెడ్డిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని పొలంపిలుస్తోంది కార్యక్రమం, సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశిస్తూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక ఉత్పత్తులతో సాధించాలంటే తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలని ఎఒ జిపి ఓబులేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ సురేష్, విఎఎ సుధా, ఎంపిటిసి నరేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

**ముద్దనూరు :** ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన ఎరువులతో పండించిన పంటలకు మార్కెట్లో డిమాండ్ ఉందని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని సంబంధిత జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. కోనాపురం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత కల్పించిందన్నారు. ప్రతి రైతు సహజ సిద్ధ వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే ఆహార ఉత్పత్తులను ప్రపంచం ఇష్ట పడుతోందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గుతుందన్నారు. దిగుబడులు ఎక్కువ సాధించవచ్చన్నారు. ద్రవ జీవావృతం తయారు చేసే విధానం గురించి రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. వ్యవసాయ శాఖ అమలుచేసే పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విహెచ్‌ఎ రామసుందర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నుజహాత్, నరసింహా రెడ్డి, రామసుధ, ముని భూపాల్, రైతులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణాలకు విద్యుత్, మంచినీటి సౌకర్యం కట్

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

మండల కేంద్రంలోని శ్రీకొండా సింగరాయ స్వామి భూమి సర్వే నెంబర్ 320లో 5 ఎకరాల 40 సెంట్లులో అనధికారికంగా ఉన్న నిర్మాణాలకు అధికారులు విద్యుత్, మంచినీటి సౌకర్యాలను కట్ చేశారు. రూ.కోట్లు విలువ చేసే భూమిలో కొన్ని సంవత్సరాలుగా నిర్మాణాలు వెలిశాయి. అక్రమ నిర్మాణాలు జరిగాయంటూ దేవాదాయ శాఖ అధికారులు కోర్టును ఆశ్రయించారు. మధ్యకాలంలో పది మంది నివాసముంటున్న వారికి కోర్టు వ్యతిరేకంగా, వాటిని స్వాధీనం చేసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం విద్యుత్ శాఖ ఎఇ రవిశంకర్, సిబ్బంది, దేవాదాయశాఖ సిబ్బంది వెళ్లి విద్యుత్, మంచినీటి కనెక్షన్లు తొలగించారు. ఇంకా దాదాపు 150మందికి పైగా ఇళ్లకు సంబంధించి తీర్పు రావాల్సి ఉన్నట్లు సమాచారం.

## నేటి నుంచి బద్రిపల్లె ఆరాధనోత్సవాలు

**చాపాడు :** మండలంలోని బద్రిపల్లె గ్రామంలో వెలసిన దిగంబర వీరయ్య స్వామి 48వ ఆరాధన మహోత్సవాలు గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. దివ్యజ్ఞాన మందిరంలో భజన కార్యక్రమాలు, భగవన్నామ సంకీర్తనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. పి.నాగార్జున నాయుడు డ్రామా కంపెనీ గాలివీడు వారిచే నాటకం ఏర్పాటు చేశారు.

## రచయితకు జాతీయ పురస్కారం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ఖాజీపేట పట్టణానికి చెందిన రచయిత షేక్ ఇంతి యాజుద్దీన్ సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషికి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం లభిం చింది. ఆ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారాన్ని హైదరా బాదులో అందజేయనున్నట్లు తెలిపారు. తనకు ఈ పురస్కారం దక్కడం చాలా గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.



షేక్ ఇంతియాజుద్దీన్

మాజీ సిఎం జగన్‌ను కలిసిన నాయకులు

## మాజీ సిఎం జగన్‌తో మండల నాయకులు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండలానికి చెందిన వైసిపి నాయకులు తాడేపల్లి గూడెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కలిసిన వారిలో వైసిపి జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తిన సుబ్బరాయుడు యాదవ్, కొత్తపేటకు చెందిన శెట్టిపల్లి సిద్ధారెడ్డి, కూనవారిపల్లి సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, రావులపల్లె మద్దిక నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ఖాజీపేట తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎవి రమణమ్మను బుధవారం మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భూమాయపల్లి సర్పంచ్ వెంకటసుబ్బయ్య యాదవ్, రాము యాదవ్, డీలర్ రామానాయుడు మాట్లాడుతూ భూ సమస్యలు, డీలర్ల సమస్యలను ఆమెకు వివరించారు. వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

## 'అలగనూరు' అభివృద్ధికి 'పుట్టా' కృషి అభినందనీయం

**ప్రజాశక్తి - చాపాడు**

కెసి కాలువ ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరు అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కృషి అభినందనీయమని కెసి కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల15న అలగనూరు బాలన్సింగ్ రిజర్వాయర్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్యతో కలిసి పుట్టా స్వయంగా సందర్శించారన్నారు. వెనువెంటనే మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అలగనూరు రిజర్వాయర్‌కు రూ.36 కోట్లు మంజూరు చేసి పూర్తి చేయుటకు కృషి చేయాలని గట్టి ప్రయత్నం చేశారన్నారు. కెసి కెనాల్ రైతులు, మైదుకూరు ప్రజల తరపున ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ

## 7న మాదిగ మహామేళాను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

జూలై 7న ఒంగోలు మున్సిపల్ ఆడిటోరియంలో జరిగే ఎంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ మాదిగ మహామేళా, హెచ్చీసీఎం కాలేజీ దగ్గర నుంచి జరిగే ర్యాలీని జయ ప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురు పాటి బ్రహ్మయ్య మాదిగ కోరారు. కొర్రపాడు రోడ్డులోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో బుధవారం ఆయన ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ 39ఏళ్ల మాదిగల ఆశ, ఆకాంక్ష సుదీర్ఘ పోరాట లక్ష్యమైన ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు చేసిన మహెూత్తర పోరాటంలో భాగస్వామ్యులైన సామాన్య కార్యకర్త నుండి అత్యున్నత స్థాయిలో శ్రమించిన ప్రతి ఒక్క మాదిగకు ఉద్యమకారులకు అభినందనలు తెలియజేస్తున్నమన్నారు. వర్గీకరణ అంశంలో తమ చిత్తశుద్ధిని చాటుకున్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రంగనాయకులు, శ్రీను, ముట్టే రవి, చిన్న ఎరికలయ్య, రమేష్ పాల్గొన్నారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

ఈ నెల 21న చేపట్టనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపిడిఒ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో బుధవారం మండలంలోని విద్య, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి అనుసరించేలా చర్యలు చేపట్టాలన్నారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఓబులేసు, శారద, ఎఒ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

**చాపాడు :** ఈనెల 21న మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో యోగా డే నిర్వహించి జయప్రదం చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక మండల సభా భవనంలో ఎంపిడిఒ వీర కిషోర్ ఆధ్వర్యంలో యోగా డేకు సంబంధించి మండల అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం యోగా డేను విజయవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. తహశీల్దార్ రమాకుమారి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గండిక్షేత్రంలో హుండీ కానుకల లెక్కింపు

**ప్రజాశక్తి - చక్రాయపేట**

రాయలసీమ జిల్లాల్లో పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలో రామబాణంతో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు (పరకామణి)ను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. హుండీల ద్వారా రూ.21,81,450 నగదు, 000.5మిల్లీ గ్రాముల బంగారు, వెండి వస్తువులు, అన్నదానం హుండీ ద్వారా రూ.29,165 ఆదాయం వచ్చిదని ఎసి తెలిపారు. అధికారులు, దేవస్థానం ఉద్యోగులందరు రాష్ట్ర ఉన్నతాధికారుల సూచన మేరకు సంప్రదాయ వస్త్రధారణతో పరకామణి నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ సూపరింటెండెంట్ రమణమ్మ, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, ఆలయ పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, చక్రాయపేట ఎపిజిబి మేనేజర్ భానుచంద్ర, సిబ్బంది, ఆర్కేవ్యాలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, మారేళ్లమడక విఆర్ఒ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కానుకల లెక్కింపులో దేవస్థాన అధికారులు, అర్చకులు

కాంగ్రెస్ పార్టీలో చేరినవారితో తులసిరెడ్డి

## కాంగ్రెస్ పార్టీలో చేరిన పలు కుటుంబాలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

చక్రాయపేట మండలం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. బుధవారం చక్రాయపేట మండల కన్వీనర్ రామాంజనేయురెడ్డి ఆధ్వర్యంలో కల్లూరుపల్లె, తండాకు చెందిన ఆంజనేయులు నాయక్, గంగరపువాండ్లపల్లెకు చెందిన రమణారెడ్డి, బురుజుపల్లెకు చెందిన పెండెం నరేంద్ర, కొండప్పగారిపల్లెకు చెందిన ద్వారకనాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పార్టీ కండు వాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే దేశం లోని ప్రజలు, రైతులు బాగుపడుతారని తులసిరెడ్డి చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. వైసిపి నుండి కాంగ్రెస్ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు.

**పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ రాద్ధాంతం అనవసరం**

పోలవరం-బనకచర్ల ప్రతిపాదిత ప్రాజెక్టుపైన తెలంగాణ రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీలతోపాటు ఆ ప్రభుత్వం రాద్ధాంతం చేయడం అనవసరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోదావరి నదిలో 75 శాతం విశ్వసనీయత ఆధారంగా మూడు వేల టిఎంసి నికర జలాలు ఉంటాయని బచావత్ ట్రిబ్యునల్ నిర్ధారించినట్లు చెప్పారు. ఆ నికర జలాలను వివిధ రాష్ట్రాలకు కేటాయించారన్నారు. ఇందులో 889 టిఎంసి మహారాష్ట్రకు, 20 టిఎంసి కర్ణాటకకు, 625 టిఎంసి చత్తీస్గఢ్‌కు, 293 టిఎంసి ఒరిస్సాకు, 1,173 టిఎంసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నికర జలాలు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించినట్లు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1,173 టిఎంసి నికర జలాలతోపాటు పునరుత్పత్తి జలాలు కలిపి 1,480 టిఎంసి నికర జలాలు కేటాయించినట్లు తెలిపారు. ఈ 1,480 టిఎంసిలో ప్రాజెక్టు వారీగా తెలంగాణ రాష్ట్రానికి 710 టిఎంసి, ఆంధ్రప్రదేశ్‌కు 770 టిఎంసి నికర జలాలు కేటాయించిందని చెప్పారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగొండ, అన్నమయ్య, ఝరికోన, పింఛ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఈ పథకాలకు నిధులు కేటాయించి సత్వరం పూర్తి చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

సమస్యలను చూపుతున్న నజీర్

## మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

స్థానిక మట్టి మసీదు వీధిలో ఉన్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నియో జకవర్గ ఇన్‌ఛార్జి నజీర్ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేక రులతో మాట్లా డారు. పట్ట ణానికి ప్రధానమైన మురుగు కాలువ రామేశ్వరం నుండి కొత్తపల్లి వరకు ఉందన్నారు. గత ప్రభుత్వ పాలకులు, వార్డు కౌన్సిలర్లు రామేశ్వరం నుంచి 25వ వార్డు మట్టి మసీదు వరకు కాలువ తీసి కొత్తగా ఇరు వైపులా గోడను నిర్మిం చాన్నారు. ప్రస్తుతం మట్టి మసీదు నుండి 25వ వార్డు 27వ సచివాలయం వరకు దాదాపు 400 మీటర్లు ఇరు వైపులా అక్రమ కట్ట డాలు నిర్మించారన్నారు. ఈ పరిస్థితిని అధికారులు పరిశీలించి కాలువ పూడిక తీసి, అక్రమ కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కాలువకు ఇరు వైపులా గోడను నిర్మించాలని కోరారు. తేలికపాటి వర్షానికి మురుగు నీరు అంతా నివ సించే ఇళ్లలోకి వస్తోందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి కూడా తీసు కెళ్లామన్నారు.

**IN THE COURT OF THE (JUNIOR DIVISION) CIVIL JUDGE, ALUR**

O.S. No. 206/2022

Between:
Sanagala Anjinamma ... Plaintiff
And
Obula Reddy Pradeep Reddy ... Defendant

**The Defendant :**
Obula Reddy Pradeep Reddy
S/o Raghava Reddy,
Porumamillu Village and Mandal,
Badvel Thaluka, YSR Cuddapa Dt.
(cell No.9182465423)

The above name Plantiff is filed the above suit against you for recovery of the suit amount. You here by directed to appear before this Hon'ble court on 01-07-2025 at 10-30 am to answer the above suit, either in person or through a pleader failing which the matter will be decided and you will be made set-exparty.

//BY ORDER OF THE COURT//

**Date of hearing: 01-07-2025**

Sd/-
Sri G.C.RANGANNA,
Sri G.RAJESH,
Sri M.JANARDHAN,
Advocates,
Alur/Adoni.